




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం,
జనవరి 23 ,2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


## రేవంత్ రెడ్డికి, సైబర్ నేరగాడికి పెద్ద తేడా లేదు: హరీశ్ రావు



- ప్రజల ఖాతాల నుంచి రేవంత్ డబ్బులు తీసుకుంటున్నారన్న హరీశ్
- హామీలపై మంత్రులను ప్రజలు నిలదీస్తున్న పరిస్థితి ఉందని వ్యాఖ్య
- డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు

మిగతా 2లో



## కొలువైన ట్రంప్ శాంతి మండలి

- 19 దేశాల అగ్రనేతల సమక్షంలో దావోస్‌లో అధికారికంగా ప్రకటించిన ట్రంప్
- కొత్త కూటమితో ఉక్రెయిన్ యుద్ధం త్వరలో ముగిసిపోనుందన్న ట్రంప్
- ఐరాసతోనూ కలిసి పనిచేస్తానన్న అమెరికా అధ్యక్షుడు
- సభ్యదేశంగా చేరిన పాకిస్తాన్
- గైర్హాజరైన భారత్

## ఆ కోటరీని నమ్మితే జగన్ ఎప్పటికీ అధికారంలోకి రాలేరు

- లిక్కర్ స్కాంలో ముగిసిన విజయసాయి రెడ్డి ఈడీ విచారణ
- అనంతరం మీడియాతో మాట్లాడిన విజయసాయి
- రాజకీయాల నుంచి తప్పుకోవడం లేదని స్పష్టం
- తనపై చేసిన వ్యాఖ్యలను జగన్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్

2లో



## ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తా

- ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే అసెంబ్లీకి హాజరవుతానని స్పష్టం చేసిన జగన్
- భూముల సమగ్ర రీసర్వేలో చంద్రబాబుది 'క్రెడిట్ చోరీ' అని తీవ్ర ఆరోపణ
- కూటమి ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని విమర్శలు
- ఏడాది తర్వాత పాదయాత్ర చేపట్టి ప్రజల్లోనే ఉంటానని ప్రకటన
- తన ఎమ్మెల్యేలు సభకు రాకపోవడంపై స్పీకర్ వ్యాఖ్యలకు జగన్ కౌంటర్

2లో

# పర్యాటకానికి ఏపీ అన్‌లాక్


**పర్యాటక ప్రాజెక్టుల కోసం ఏపీని అన్‌లాక్ చేశామన్న సీఎం చంద్రబాబు**



- ఆతిథ్య రంగంలో పెట్టుబడులపై తమారా లీజర్ సంస్థతో చర్చలు
- విశాఖలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుకు కాలిబో ఏఐ సంస్థకు పిలుపు
- పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పిస్తున్నట్టు వెల్లడి
- గిరిజన ప్రాంతాల్లో ఎకో టూరిజం ఏర్పాటుకు తమారా సంస్థ ఆసక్తి

ఏపీలో పర్యాటక రంగంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఇందుకోసం రాష్ట్రాన్ని పూర్తిగా అన్‌లాక్ చేశామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా ఆయన పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో పర్యాటకం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాలపై ప్రధానంగా దృష్టి సారించారు. సదస్సులో భాగంగా తమారా లీజర్ సీఈఓ సృష్టి శిబులాల్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. రాష్ట్రంలోని ఆతిథ్య రంగంలో పెట్టుబడి అవకాశాలను ఆమెకు వివరించారు. పర్యాటక ప్రాజెక్టులకు ఇప్పటికే పారిశ్రామిక హోదా కల్పించామని, పెట్టుబడిదారులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. పోలవరం నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో, అలాగే కోనసీమ, గండికోట, అరకు, లంబసింగి వంటి ప్రాంతాల్లో టూరిజం ప్రాజెక్టులు అభివృద్ధి చేయడానికి అపార అవకాశాలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. దీనిపై స్పందించిన తమారా ప్రతినిధులు, గిరిజన ప్రాంతాల్లో ఎకో టూరిజం పార్కులు, విశాఖ వంటి నగరాల్లో హోమ్ స్టే ప్రాజెక్టులు చేపట్టేందుకు ఆసక్తిగా ఉన్నామని తెలిపారు.

2లో




## లోయలో పడిన ఆర్మీ వాహనం

**10 మంది సైనికుల మృతి**

**మరో 11 మందికి తీవ్ర గాయాలు**

**కశ్మీర్‌లోని దోడా జిల్లాలో దుర్ఘటన**

2లో



## నైనీ కోల్ బ్లాక్ టెండర్ రద్దు

**సింగరేణిపై ఆరోపణల తుఫాన్**

- వివాదాల మధ్య వెనక్కితగ్గిన సింగరేణి
- టెండర్ నిబంధనలపై అనుమానాల మేఘాలు
- రాజకీయ ఆరోపణలు-సీబీఐ విచారణ డిమాండ్
- కేంద్ర జోక్యం-అత్యవసర సమావేశం
- గనుల ఉత్పత్తిపై ప్రభావం-ఆలస్యం తప్పదా?

## కేటీఆర్‌కు నోటీసులు

- ఫోన్ ట్యాపింగ్ కేసులోజారీ చేసిన సిట్
- శుక్రవారం విచారణకుహాజరు కావాలని ఆదేశం..
- మరోసారి హరీశ్‌రావును విచారించాలని నిర్ణయం
- కవిత నుంచి వాంగ్మూలంనమోదుకూ సన్నాహాలు



2లో

# భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్

- దావోస్ వేదికగా తెలంగాణకు భారీ పెట్టుబడులు
- యూపీసీ వోల్ట్‌తో ఎంఓయూ-తెలంగాణకు కీలక ముందడుగు
- భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు.
- పునరుత్పాదక విద్యుత్‌తో నెట్ జీరో లక్ష్యం
- వేలాది ఉద్యోగావకాశాలు-యువతకు కొత్త అవకాశాలు
- దావోస్‌లో తెలంగాణకు పెరుగుతున్న పెట్టుబడుల ప్రవాహం

దావోస్ వేదికగా తెలంగాణ రాష్ట్రానికి విదేశీ పెట్టుబడుల సాధనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం కీలక పురోగతి సాధించింది. ప్రపంచ ఆర్థిక వేదిక వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో భాగంగా నెదర్లాండ్స్‌కు చెందిన యూపీసీ రిన్యూవబుల్స్ గ్రూప్ అనుబంధ సంస్థ యూపీసీ వోల్ట్‌తో తెలంగాణ

2లో



## పర్యాటకానికి ఏపీ అన్‌లాక్

**(మొదటి పేజీ తరువాయి)**

మరోవైపు కాలిబో ఏఐ అకాడెమీ వ్యవస్థాపకులు రాజ్ వట్టికూటితోనూ ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఇప్పటికే అమరావతిలోని ఓ ప్రైవేట్ విశ్వవిద్యాలయంలో తమ సంస్థ యువతకు ఏఐలో శిక్షణనిస్తోందని కాలిబో ప్రతినిధులు సీఎంకు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని ఇతర విశ్వవిద్యాలయాలకు కూడా విస్తరించాలని చంద్రబాబు సూచించారు. విశాఖపట్నంలోని మధురవాడ ఐటీ సెజ్‌లో ఒక "సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్" కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కాలిబో ఏఐ సంస్థను ఆయన ఆహ్వానించారు. ఈ సమావేశంలో మంత్రి టీజీ భరత్ కూడా పాల్గొన్నారు. గత ఏడాది దావోస్ పర్యటన ద్వారా ఇప్పటికే రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడులు గ్రౌండ్ అయ్యాయని, తాజా పర్యటన కూడా మంచి ఫలితాలే ఇస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రీన్ ఎనర్జీ, కృత్రిమ మేధ (ఏఐ), వ్యవసాయం, పర్యాటకం వంటి రంగాల్లో రాష్ట్రం సాధిస్తున్న విజయాలను.. వనరులను సమర్థంగా ప్రపంచ దేశాలకు వివరించగలిగామని, గతంతో పోల్చుకుంటే ప్రపంచ దిగ్గజ సంస్థలు భారత్ వైపు ఎక్కువ ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. యూరోపలోని తెలుగు ప్రజలతో మమేకం అవుతూ తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని చంద్రబాబు పేర్కొన్నారు. నాలుగు రోజుల దావోస్ పర్యటన ముగించుకుని చంద్రబాబు స్వదేశానికి తిరుగుపయనమయ్యారు. భారతకాలమానం ప్రకారం గురువారం సాయంత్రం 6.30 గంటలకు అక్కడి నుంచి బయల్దేరారు. శుక్రవారం ఉదయం 8.25కి హైదరాబాద్ చేరుకోనున్నారు. అక్కడి నుంచి 10 గంటలకు అమరావతి చేరుకుని.. 11 గంటల నుంచి సచివాలయంలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

## నైనీ కోల్ బ్లాక్ టెండర్ రద్దు

ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌లో బొగ్గు తవ్వకాల కోసం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ జారీ చేసిన టెండర్ నోటిఫికేషన్‌ను చివరి నిమిషంలో రద్దు చేయడం సాధారణ పరిపాలన నిర్ణయం కాదని, అది రాజకీయ ఒత్తిళ్లు, అవినీతి ఆరోపణలు, కేంద్ర జోక్యం కలగలిసిన పరిణామమని ఇప్పుడు స్పష్టమవుతోంది. "పరిపాలనాపరమైన కారణాలు" అనే ముసుగులో టెండర్‌ను రద్దు చేసినప్పటికీ, వాస్తవంగా టెండర్ నిబంధనల రూపకల్పనలో జరిగిన లోపాలు, పారదర్శకత లేకపోవడం, కొందరు ప్రైవేట్ సంస్థలకు అనుకూలంగా షరతులు రూపొందించారన్న ఆరోపణలే సింగరేణిని వెనక్కితగ్గేలా చేశాయని రాజకీయ, పరిపాలన వర్గాలు స్పష్టంగా చెబుతున్నాయి. గురువారం సాయంత్రం 5 గంటల నుంచి బిడ్ల స్వీకరణ ప్రారంభం కావాల్సి ఉండగా, ఎలాంటి ముందస్తు వివరణ లేకుండా టెండర్ ప్రక్రియను నిలిపివేయడం అనేక అనుమానాలకు బీజం వేసింది. ముఖ్యంగా 'సైట్ విజిట్ తప్పనిసరి' అనే నిబంధనను టెండర్‌లో చేర్చడం, తక్కువ సమయంలోనే ఆ షరతును అమలు చేయడం వలన చాలా సంస్థలు పోటీ నుంచి తప్పుకునే పరిస్థితి ఏర్పడిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నిబంధన వాస్తవానికి పోటీని తగ్గించి, కొద్దిమంది పెద్ద కంపెనీలకు మాత్రమే అవకాశం కల్పించేలా ఉందన్న విమర్శలు రావడంతో సింగరేణి విశ్వసనీయత తీవ్రంగా దెబ్బతింది.

## ఆ కోటరీని నమ్మితే జగన్ ఎప్పటికీ అధికారంలోకి రాలేరు

ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ ఆరోపణల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరైన వైసీపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి, అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ భవిష్యత్తుపై కీలక ప్రకటన చేయడంతో పాటు, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న కోటరీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారి వల్లే పార్టీకి ఈ దుస్థితి దాపురించిందని, ఆ కోటరీ మాటలు నమ్మితే జగన్ మళ్లీ అధికారంలోకి రావడం అసాధ్యమని తేల్చిచెప్పారు. గత ఏడాది రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన విజయసాయి రెడ్డి, ఆ నిర్ణయంపై యూ-టర్న్ తీసుకున్నారు. తాను రాజకీయాల నుంచి తప్పుకోవడం లేదని, జూన్ తర్వాత తన రాజకీయ భవిష్యత్ ప్రణాళికలను వెల్లడిస్తానని స్పష్టం చేశారు. లిక్కర్ స్కామ్ విచారణలో భాగంగా ఈడీ అధికారులు తనను ప్రశ్నించారని, అయితే అసలు ఏపీలో లిక్కర్ స్కామ్ జరిగిందని తాను భావించడం లేదని అధికారులకు చెప్పినట్లు వెల్లడించారు. మిథున్ రెడ్డి కోరిక మేరకు శ్రీధర్ రెడ్డి కంపెనీకి సిఫారసు చేసిన మాట వాస్తవమేనని, కానీ రూ.100 కోట్లు ఏర్పాటు చేయాలని జగన్ తనతో ఎన్నడూ చెప్పలేదని ఆయన కుండబద్దలు కొట్టారు.

## కొలువైన ట్రంప్ శాంతి మండలి

దావోస్/న్యూఢిల్లీ: మాటలతోనే పెనుకుంపట్లు రాజేసే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శాంతికాముకుడి అవతారమెత్తి ప్రపంచ యవనికపై కొత్త కూటమిని కొలువుతీర్చారు. ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలు జరుగుతున్న దావోస్ నగరంలో 19 దేశాల అగ్రనేతల సమక్షంలో బోర్డ్ ఆఫ్ పీస్(శాంతి మండలి)ని ట్రంప్ గురువారం అధికారికంగా ప్రకటించారు. అగ్రనేతల సమక్షంలో సంబంధిత పత్రంపై ట్రంప్ సంతకం చేసి కొత్త కూటమిని ఉనికిలోకి తీసుకొచ్చారు. ఐక్యరాజ్యసమితికి ప్రత్యామ్నాయంగా తన కనుసన్నల్లో పనిచేసేలా గాజా పునర్‌నిర్మాణ, అభివృద్ధి మాటున శాంతి మండలిని ఏర్పాటుచేస్తున్నారన్న తీవ్ర ఆరోపణలను ట్రంప్ ఈ సందర్భంగా తోసిపుచ్చారు. " శాంతి మండలిలో భాగస్వాములుగా ఉండేందుకు ప్రతి దేశం అమితాసక్తి కనబరుస్తోంది.

## లోయలో పడిన ఆర్మీ వాహనం

జమ్మూ/భదేర్వాహ్, జనవరి 22: జమ్మూ కశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. 21మంది జవాన్లు ప్రయాణిస్తున్న ఆర్మీ బుల్లెట్ ప్రూఫ్ వాహనం 'కాస్పెర్' అదుపు తప్పి 200 అడుగుల లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మిగతా 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. జవాన్లు ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌కు వెళుతుండగా భదేర్వాహ్-చంబా అంతర్రాష్ట్ర రహదారి వెంబడి ఉన్న 9వేల అడుగుల ఎత్తులోని ఖన్నీ టాప్ ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం ఈ దుర్ఘటన సంభవించింది. విపరీతంగా మంచు కురుస్తుండడంతో రోడ్డు పైనుంచి జారిన వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో పక్కనున్న లోయలోకి పడిపోయింది. వెంటనే ఆర్మీ, పోలీసు బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని జవాన్లను బయటకు తీసుకొచ్చారు. నలుగురు జవాన్లు అక్కడికక్కడే మరణించగా.. తీవ్రం గా గాయపడిన 17 మందిని భదేర్వాహ్ ఆస్పత్రికి తరలించారు. వారిలో ఆరుగురు చికిత్స పొందుతూ మరణించారు. 10మందిని హెలికాప్టర్‌లో ఉధంపూర్ కమాండ్ ఆస్పత్రికి తరలించారు.

# ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తా



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడంపై వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ గురువారం కీలక ప్రకటన చేశారు. తనకు ప్రతిపక్ష నేత (హ్యూ) హోదా కల్పిస్తే తప్ప అసెంబ్లీలో అడుగుపెట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. అధికార కూటమి ప్రభుత్వ అక్రమాలను, తప్పుడు పనులను సభలో ఎండగట్టాలంటే ప్రతిపక్ష హోదా తప్పనిసరి అని, అప్పుడే తనకు తగినంత సమయం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగన్ మాట్లాడుతూ.. అసెంబ్లీలో ఏకైక ప్రతిపక్షంగా ఉన్న వైసీపీకి ఆ హోదా ఇవ్వడానికి స్పీకర్‌కు ఉన్న అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. "అసెంబ్లీలో ఉన్నది ఒక్కటే ప్రతిపక్షం, అది వైసీపీ మాత్రమే. మిగతా పార్టీలన్నీ ప్రభుత్వంలో భాగస్వాములే. మరి మాకు ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా స్పీకర్ ఎందుకు అడ్డుకుంటున్నారు? ఇది ప్రజాస్వామ్యమా అని మీరు స్పీకర్‌ను ప్రశ్నించాలి" అని జగన్ అన్నారు. అసెంబ్లీకి హాజరుకాని ఎమ్మెల్యేలకు "పని చేయకపోతే జీతం లేదు" (నో వర్క్, నో పే) విధానం అమలు చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నిన్న లక్నోలో జరిగిన సదస్సులో సూచించిన నేపథ్యంలో జగన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. వైసీపీకి చెందిన 11 మంది ఎమ్మెల్యేలు 2024 నుంచి అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్న విషయం తెలిసిందే. భూముల సమగ్ర రీసర్వే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 'క్రెడిట్ చోరీ'కి పాల్పడుతున్నారని జగన్ తీవ్రంగా ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన 'భూ రక్ష', 'భూ హక్కు' పథకాలను చంద్రబాబు హైజాక్ చేశారని, ఈ బృహత్కార్యంలో ఆయన పాత్ర ఏమాత్రం లేకపోయినా ఘనతను దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తన పాదయాత్ర సందర్భంగా రైతులు భూ వివాదాలు, టైటిల్స్ సమస్యలపై తన వద్ద గోడు వెళ్లబోసుకున్నారని, అందుకే 2019 మేనిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చామని గుర్తుచేశారు. తమ హయాంలో రూ.6,000 కోట్లు ఖర్చు చేసి, దాదాపు 40,000 మంది సిబ్బందిని నియమించి అత్యాధునిక టెక్నాలజీతో సమగ్ర భూ సంస్కరణలు చేపట్టామని, ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ప్రశంసలు లభించాయని తెలిపారు. కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చాక, రైతులకు గతంలో ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలను వెనక్కి తీసుకుని, వాటి రంగు మార్చి మళ్లీ ఇస్తూ మొత్తం ఘనత తనదేనని ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ కొత్త పాస్‌బుక్‌లలో తప్పులు ఎక్కువగా ఉండటంతో రైతుల కష్టాలు మరింత పెరిగాయన్నారు. అంతేకాకుండా, ఈ పథకం అమలును ప్రశంసిస్తూ కేంద్రం ఇచ్చిన రూ.400 కోట్ల నిధులను కూడా టీడీపీ నాయకత్వం పక్కదారి పట్టించిందని ఆరోపించడం సంచలనం రేపింది.

## భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రభుత్వం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకోవడం రాష్ట్ర డిజిటల్ అభివృద్ధిలో మైలురాయిగా నిలిచింది. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణను దేశంలోనే ఏఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి బలమైన పునాది పడింది. ఒప్పందం ప్రకారం భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల సామర్థ్యంతో అత్యాధునిక ఏఐ అనుకూల డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు ఐదేళ్ల కాలంలో దాదాపు రూ.5,000 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ సరఫరాను కూడా పూర్తిగా పునరుత్పాదక వనరుల ద్వారానే అందించేందుకు 100 మెగావాట్ల సామర్థ్యంతో ప్రత్యేక రిన్యూవబుల్ ఎనర్జీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుండటం విశేషం. ఈ ఒప్పందానికి ముందు సీఎం రేవంత్ రెడ్డి యూపీసీ వోల్ట్ సీఈవో హాన్ డీ గ్రూట్, యూపీసీ రిన్యూవబుల్స్ ఏపీఏసీ సహ వ్యవస్థాపకుడు స్టీవెన్ జ్వాన్, యూపీసీ రిన్యూవబుల్స్ ఇండియా సీఈవో అలోక్ నిగమ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణలో ఉన్న ఐటీ మౌలిక సదుపాయాలు, అనుకూల విధానాలు, భవిష్యత్తు నగరాల అభివృద్ధి ప్రణాళికలను సీఎం వివరించారు. నెదర్లాండ్స్‌కు చెందిన యూపీసీ రిన్యూవబుల్స్ గ్రూప్, వోల్ట్ డేటా సెంటర్స్ కలిసి యూపీసీ వోల్ట్ సంస్థగా ఏర్పడగా, ఆసియాపసిఫిక్ ప్రాంతంలో భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టే దిశగా ముందడుగు వేస్తోంది. అందులో భాగంగా భారత్‌లో తమ తొలి భారీ ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్ట్‌కు తెలంగాణను ఎంపిక చేయడం రాష్ట్రానికి లభించిన విశ్వాసానికి నిదర్శనంగా భావిస్తున్నారు.దఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే ప్రత్యక్షంగా, పరోక్షంగా మూడు వేల మందికి పైగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. డేటా సెంటర్ పూర్తిగా కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత మరో 800 మంది వరకు నైపుణ్యం కలిగిన యువతకు ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి. ముఖ్యంగా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ రంగాల్లో తెలంగాణ యువతకు కొత్త అవకాశాలు విస్తృతంగా అందుబాటులోకి రానున్నాయి. దీంతో హైదరాబాద్‌తో పాటు ఫ్యూచర్ సిటీ పరిసర ప్రాంతాలు హైటెక్ ఉపాధి కేంద్రాలుగా రూపాంతరం చెందనున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆ లక్ష్య సాధనలో డిజిటల్ ప్రగతి, ఆధునిక ఐటీ మౌలిక వసతులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అభివృద్ధిపర్యావరణ పరిరక్షణ రెండూ సమాంతరంగా సాగాల్సిన అవసరం ఉందని, నెట్ జీరో సిటీ భావనతోనే తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని తెలిపారు. పునరుత్పాదక విద్యుత్ వినియోగంతో డేటా సెంటర్ ఏర్పాటవ్వడం ఈ విజన్‌కు అనుగుణంగానే ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన విధానపరమైన ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాలు రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుందని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం ఉందని, వేగవంతమైన అనుమతులు, స్థిరమైన పాలసీలే పెట్టుబడుల ఆకర్షణకు కారణమని అన్నారు. నెట్ జీరో సిటీ అభివృద్ధి తెలంగాణ విజన్‌లో భాగమని, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ ద్వారా పర్యావరణహిత అభివృద్ధిని సాధిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూడా పాల్గొన్నారు. దావోస్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి బృందం ఇప్పటివరకు తెలంగాణకు 20 వేల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడుల ఒప్పందాలు కుదుర్చుకోవడం మరో ముఖ్యమైన అంశం.

## రేవంత్ రెడ్డికి, సైబర్ నేరగాడికి పెద్ద తేడా లేదు: హరీశ్ రావు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సిట్ నోటీసులు జారీ కావడంపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి ప్రవర్తనకు, ఒక సైబర్ నేరగాడి ప్రవర్తనకు పెద్ద తేడా లేదంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రజల కోసం ఖజానా నుంచి డబ్బులు ఖర్చు చేశామని, కానీ రేవంత్‌రెడ్డి మాత్రం ప్రజల ఖాతాల నుంచే డబ్బులు తీసుకుంటానంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజలు మంత్రులను నిలదీస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, దృష్టి మళ్లించేందుకు సిట్ నోటీసులు పంపుతున్నారని విమర్శించారు. తాను, కేటీఆర్... ప్రభుత్వ వైఫల్యాలను గట్టిగా ప్రశ్నిస్తున్నందు వల్లే ఈ చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా భయపడబోమని, హామీల అమలుపై ప్రశ్నించడం ఆపేది లేదని స్పష్టం చేశారు. డైవర్షన్ రాజకీయాలు చేస్తూ నీ బావమరిది కుంభకోణం బయటకు రాకుండా చూడాలనే ప్రయత్నమా? అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్ మంత్రులు వాటాల కోసం కొట్టుకుంటున్నారని, ఆ పార్టీ పని అయిపోయిందని హరీశ్ వ్యాఖ్యానించారు. ప్రజల ముందుకు రావడానికి కాంగ్రెస్ నేతలు జంకుతున్నారని చెప్పారు. "ఎన్ని నోటీసులు ఇచ్చినా భయపడబోం. 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేసే వరకూ మీ వెంటపడుతూనే ఉంటాం" అని అన్నారు.

# కేటీఆర్‌కు నోటీసులు



హైదరాబాద్: రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా చోటు చేసుకున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే మాజీ మంత్రి హరీశ్‌రావుకు నోటీసులు జారీ చేసి విచారించగా.. తాజాగా మరో మాజీ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు గురువారం నోటీసులు ఇచ్చింది. శుక్రవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాల్సిందిగా స్పష్టం చేసింది. నందినగర్‌లోని కేటీఆర్ ఇంటికి వెళ్లిన పోలీసులు సీఆర్పీసీలోని సెక్షన్ 160 ప్రకారం నోటీసులు అందజేశారు. ఇలావుండగా ఈ కేసులో హరీశ్‌రావును మరోసారి విచారించాలని, మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకూ నోటీసులు ఇచ్చి వాంగ్మూలం నమోదు చేయాలని సిట్ నిర్ణయించింది.

**కుల ప్రాతిపదికన నియామకాలు?**

బీఆర్ఎస్ నాయకులు కుల సమీకరణల్లో భాగంగానే డీఐజీ హోదాలో ఉన్న టి.ప్రభాకర్‌రావును 2016లో ఎస్ఐబీ చీఫ్‌గా నియమించారని సిట్ ఆరోపిస్తోంది. 2017లో పి.రాధాకిషన్‌రావును బీఆర్ఎస్ పార్టీ పెద్దలే హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా ఎంపిక చేశారని పేర్కొంటోంది. ఈయన 2020 ఆగస్టులో పదవీ విరమణ చేసినప్పటికీ కుల ప్రాతిపదికన ఆయనకు బీఆర్ఎస్ ప్రభుత్వం రెండుసార్లు ఓఎస్డీగా అవకాశం ఇచ్చిందని సిట్ ఆరోపిస్తోంది.

**అనుకూలంగా పనిచేసేందుకే..!**

ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు హైదరాబాద్ నగరంపై పట్టు కొనసాగడానికే బీఆర్ఎస్ నేతలు ఇలా చేశారని చెబుతోంది. ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు, ప్రణీత్‌రావు, భుజంగరావు తరచుగా కలుస్తూ బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలో కొనసాగడం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించే వారని సిట్ తన దర్యాప్తులో గుర్తించింది. ప్రభాకర్‌రావు తన నమ్మినబంటు ప్రణీత్‌రావును స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్ఓటీ) నిర్వహణ కోసమే ఎస్ఐబీలోకి తీసుకువచ్చారని ప్రత్యేక దర్యాప్తు బృందం పేర్కొంటోంది. బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా పని చేయడం, ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టడానికి ఆ నేతలతో పాటు వారి అనుచరులనూ టార్గెట్ చేయడం, అక్రమ నిఘాతో సున్నిత సమాచారం సేకరించి అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌లో చేరేలా చేయడం వంటి లక్ష్యాలతోనే ప్రభాకర్‌రావు ఎస్ఐబీలోఎస్ఓటీ ఏర్పాటు చేశారని ఆరోపిస్తోంది.

**బీఆర్ఎస్ నాయకులపైనా కన్ను!**

బీఆర్ఎస్ పార్టీ పెద్దల ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు కొందరి పైనా ప్రభాకర్‌రావు, ఆయన బృందం కన్నేశారని చెబుతోంది. కాగా వీరు ప్రధానంగా ప్రతిపక్షాలకు చెందిన నగదు రవాణా పైనే దృష్టి పెట్టి భారీ మొత్తంలో పట్టుకున్నారు. ఈ పరిణామాలతో పాటు దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాలు, నిందితుల వాంగ్మూలాలు, సాక్షులు ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా అక్రమ ఫోన్ ట్యాపింగ్ వెనుక పెద్దలు ఉన్నారని సిట్ అనుమానిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు కొంత కీలక సమాచారం సేకరించడానికి కేటీఆర్‌ను ప్రశ్నించాలని సిట్ నిర్ణయించినట్లు సమాచారం.

**హరీశ్‌ను ఇంకా ప్రశ్నించాలి..**

హరీశ్‌రావును మంగళవారం పూర్తిస్థాయిలో ప్రశ్నించలేదని, మరికొన్ని అంశాలు మిగిలిపోయాయని సిట్ అధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయనకు మరోసారి నోటీసులు జారీ చేయాలని భావిస్తున్నారు. కాగా కల్వకుంట్ల కవిత ఇప్పటికే అనేకసార్లు మీడియా ముందుకు వచ్చి తన ఫోన్ ట్యాప్ అయిందని, తన కుటుంబీకుల్నీ ప్రభాకర్‌రావు విడిచిపెట్టలేదని వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఆమెకూ నోటీసులు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు మార్చి 10న విచారించనుండటంతో సిట్ దూకుడు పెంచింది.

## జగిత్యాల జిల్లా తపస్ అసోసియేట్ అధ్యక్షునిగా కూర్మాచలం రఘునందన్



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 22

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జగిత్యాల జిల్లా అసోసియేట్ అధ్యక్షునిగా బుగ్గారం మండలం యశ్వంత రావు పేట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న కూర్మాచలం రఘునందన్ ని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా జీవో 317 .పీఆర్సీ, పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం దృష్టి కి తీసుకొని పోవడానికి కృషి చేస్తానని అన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వోద్నల రాజశేఖర్, జిల్లా అధ్యక్షులు బోయినపల్లి ప్రసాదరావు, కొక్కుల రాజేష్, అయిల్నేని నరేందర్రావు, మహిపాల్ రెడ్డి తదితరులు అభినందనలు తెలియజేశారు.




## ఇటిక్యాల లో నువ్వు పంట సాగులో యజమాన్యం రైతు శిక్షణ శిబిరం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 22జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో గురువారం రోజున లజిఎమ్మర్ ఎఫ్పీసీ వారి ఆధ్వర్యంలో గిరిజన ఉప ప్రణాళిక వేసవి నువ్వు పంట సాగులో యజమాన్యం రైతు శిక్షణ శిబిరం నిర్వహించారు.. రైతులు గతంలో సాగుచేసిన నువ్వు పంటలకు ఎదురైన సమస్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త సంధ్య కిషోర్, తెగుళ్ళ విభాగం శాస్త్రవేత్త సుమలత, కీటక విభాగం శాస్త్రవేత్త స్వాతి లు రైతులకు నువ్వు పంటలు ఎలా వెయ్యాలో, కాండం, ఆకుల మీద వచ్చే తెగుళ్ల గురించి, క్రిమి కీటకాల గురించి వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపల్లి గంగారెడ్డి, మాజీ సర్పంచ్ మరిపెల్లి నారాయణ గౌడ్, సామల లావణ్య వేణు, మాజీ సింగిల్ విండో చైర్మన్లు సుర కంటి రాజారెడ్డి, కాటిపెల్లి నారాయణరెడ్డి, ఎఫ్ పీసీ చైర్మన్ గడ్డం రాజేందర్ రెడ్డి, రైతులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ముఖ్యము

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 22జగిత్యాల జిల్లా రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలకు 'రామాజీపేట దుబాయ్ వారధి సంఘం' సభ్యులు విద్యార్థుల క్రీడల కొరకు గురువారం రోజు పాఠశాల ఉపాధ్యాయులకు 5000/- రూపాయల ఆర్థిక చేయూతని అందించారు. ఈ సందర్బంగా దుబాయ్ వారధి సంఘం సభ్యుడు వట్టిమల్ల శ్రీనివాస్(దుబాయ్ శ్రీను) మాట్లాడుతూ చిన్న వయసు నుండే విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆటలు ఉన్నతమైన స్థానానికి తీసుకెళ్తాయని, ఆటలు విద్యార్థులలో పోటీ తత్వంతో పాటు క్రీడా స్ఫూర్తిని కలిగిస్తాయని, మంచి క్రీడాకారులుగా తయారవుతారని తెలిపారు. దుబాయ్ వారధి సంఘంతో పాటు మన గ్రామంలో మన ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి మన వంతు చేయూతను అందించాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెజ్జంకి మోహన్, మాజీ సర్పంచ్ వాసరి రవి, సూర విజయ్, దుబాయి వారధి సంఘం సభ్యులు వట్టిమల్ల శ్రీనివాస్ (దుబాయ్ శ్రీను), బట్టు నరసయ్య, బేతి వంశీ రెడ్డి , గ్రామ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## అల్లీపూర్ లో సి.ఎం.కప్ గ్రామ పంచాయతీ పోటీలు ప్రారంభం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 22జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సి. ఎం. కప్ గ్రామ పంచాయతీ పోటీలను గ్రామ సర్పంచ్ శ్రీమతి ఎంబారీ గౌతమి వెంకటేష్ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి ఒలింపిక్ స్థాయి వరకు క్రీడల్లో ప్రతి ఒక్కరు ఎదగాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం కప్ క్రీడలను ప్రారంభించారని తెలుపడంతో పాటు క్రీడల్లో పాల్గొనడం ద్వారా ప్రతి ఒక్కరు మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెంపొందిందని అన్నారు. ఈక్రీడల్లో ఎంపికైన క్రీడాకారులు మండల పోటీల నుండి ప్రతిభ గలవారు, రాష్ట్రస్తాయి వరకు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వినయ్, ప్రధానోపాధ్యాయులు కిరణ్, గ్రామ కార్యదర్శి శేఖర్, గ్రామ పెద్దలు వెంకటేష్, పి. డి. కృష్ణప్రసాద్, సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం

**- ఎమ్మెల్యే వ్యాఖ్యల పై కఠిన విమర్శలు**

**- అఖిలపక్ష జేఏసీ నాయకులకు మద్దతుగా**

**- బిజెపి నాయకులు గుజ్జుల ప్రతాప్ రెడ్డి.**



కల్వకుర్తి జనవరి 22 వార్త మిర్రర్ ప్రతినిధి:-కల్వకుర్తి ఊర్కొండ వార్త మిర్రర్ ప్రతినిధి:- ఊర్కొండ జేఏసీ 13వ రోజున దీక్షకు సంపూర్ణ మద్దతుగా బిజెపి సీనియర్ నాయకులు గుజ్జుల ప్రతాప్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఉద్యమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. అఖిల పక్ష జేఏసీ అద్వర్యంలో గత 13 రోజులుగా వినూత్న రీతిలో దీక్షలు కొనసాగుతుంటే జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఈ మండలానికి విచ్చేసి ఈ ప్రాంత ప్రజల బాగోగుల గురించి మాట్లాడకుండా జేఏసి నాయకులను అర్ధరాత్రి హౌస్ అరెస్టులు చేయించి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలనే కనీస అవగాహన లేకుండా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ప్రజాభిప్రాయం లేకుండా ఇష్టానుసారంగా అసెంబ్లీ సాక్షిగా తన స్వార్థ రాజకీయ లబ్ధి కోసం ప్రకటనలు చేయడం అమానుషమని అన్నారు. 13 వ రోజున ఈ నిరాహార దీక్ష విరమణ చేపడుతూ తదుపరి కార్యాచరణ గ్రామ స్థాయిలో తీసుకెళ్ళాలి అని ఎజెండా తో కలిసికట్టుగా ముందుకు వెళ్ళాలి అని దిశగా నిర్దేశించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో 13వ రోజున ముఖ్య అతిథిగా మరియు దీక్ష విరాణించడానికి బీజేపీ సీనియర్ నాయకులు గుజ్జుల ప్రతాప్ రెడ్డి వచ్చి సంఘీభావం తెలిపారు. అదే విధంగా ఊర్కొండ సర్పంచ్ మ్యాకల మంజుల శ్రీనివాస్ ఊర్కొండ జేఏసీ నాయకులు నిరంజన్ గౌడ్.తాడేం.చిన్న. నరేందర్ గౌడ్.జంగయ్య.దివాకర్ గౌడ్.శివ.ఆనంద్ గౌడ్.జంగయ్య. బాలకిష్టయ్య.నారాయణ్ రెడ్డి.షబ్బీర్.తిరుపతి రెడ్డి. తదితర జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## జన్వాడ ప్రభుత్వ పాఠశాలలో మోకిల పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు



శంకర్?పల్లి: జనవరి 22: వార్త మిర్రర్: మోకిల పోలీసుల ఆధ్వర్యంలో జన్వాడ ప్రభుత్వ పాఠశాలలో గురువారం అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత పైన అవగాన సదస్సు, ఎస్సే రైటింగ్, పెయింటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి మోకిల సీఐ వీరబాబు గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని హెల్మెంట్, సీటు బెల్టు ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, రాంగ్ రూట్, త్రిబుల్ రైడింగ్ చేయరాదని, అలాగే వాహనం నడిపేటప్పుడు డాక్యుమెంట్స్ కలిగి ఉండాలని కోరారు. ఏదైనా ఎమర్జెన్సీ ఉంటే 100కి కాల్ చేసి సమాచారం ఇస్తే తక్షణమే స్పందిస్తామని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, కాంపిటీషన్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఐ సమరం రెడ్డి, ఎస?లు ధర్మరాథోడ్, పద్మ, ఎంఈఓ అక్బర్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



## శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో ప్రారంభమైన రథ సప్తమి సూర్య జయంతి ఉత్సవాలు

వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి జనవరి 22

జగిత్యాల పట్టణం లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయము లో రథ సప్తమి సూర్య జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైయినాయి. రథ సప్తమి సూర్య జయంతి ఉత్సవం మొదటి రోజు గురువారం మాఘ మాసం శుక్ల పక్షం చవితి ఉ.గం. 5.15 ని.ల కు సుప్రభాత సేవ, ధృవమూర్తులకు అభిషేకములు. ఉ.గం. 10-15 ని ల కు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహ వచనం, రక్షా బంధనం, పంచగవ్య ప్రాశనం, పల్లకి సేవా, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఇట్టి కార్యక్రమములో ఫౌండర్ అండ్ ఛైర్మెన్ డాక్టర్ వద్ల గట్ట రాజన్న, మేనేజింగ్ ట్రస్ట్ గట్టు రాజేందర్?, ప్రెసిడెంట్ ముత్యాల రామలింగారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వోద్నాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వద్ల గట్ట శంకర్, కోశాధికారి వద్లగట్ట స్వాతి, సహాయ కోశాధికారి వద్లగట్ట గోపి, ధర్మకర్తలు వొద్నాల లత, భారతాల గీత, తిరుపతి, అర్చకులు ప్రణయ్? కుమార్?, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలకు బ్లూటూత్ సౌండ్ బాక్స్ స్పీకర్ బహుకరణ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 22

రాయికల్ మండలం అయోధ్య ప్రభుత్వ పాఠశాలలో గ్రామ సర్పంచ్ సిరిపురం లక్ష్మీ గంగాధర్ విద్యార్థుల సౌలభ్యం దృష్ట్యా రూ. 20 వేలు విలువ గల అహుజా కంపెనీ సౌండ్ బాక్స్ బ్లూటూత్ స్పీకర్ ను పాఠశాలకు బహుకరించారు. ఈ సందర్బంగా పాఠశాలప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో గ్రామ నాయకులు కొమురవెల్లి చిరంజీవి, ఎడమల జగదీశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




## కల్వకుర్తి మున్సిపాలిటీ ఎన్నికలో బీజేపీకి కొత్త ఇంచార్జి - శ్రీ రాములు యాదవ్

కల్వకుర్తి జనవరి 22 వార్త మిర్రర్ ప్రతినిధి:-

కల్వకుర్తి మున్సిపాలిటీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీరాములు యాదవ్ ను కల్వకుర్తి మున్సిపాలిటీ బీజేపీ ఎన్నికల ఇంచార్జిగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ నియమించింది.నియామకంతో సంతోషంగా, శ్రీరాములు యాదవ్ మొదటిసారి కల్వకుర్తికి విచ్చేసి,తల్లోజు ఆచారి జాతీయ మాజీ బీసీ కమిషన్ సభ్యుడు ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పార్టీ ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఎల్బీనగర్ సర్కిల్,హస్తినాపురం,బైరమల్ గూడా వార్డు కార్యాలయాల నిర్మాణానికి

**-6 కోట్ల నిధుల మంజూరుకు ప్రతిపాదనను సిద్ధం చేయండి మేయర్ గద్వాల విజయలక్ష్మి**

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా

ప్రతినిధి జనవరి 22 : ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయం మరియు హస్తినాపురం బైరమల్ గూడా వార్డ్ కార్యాలయలు నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ ను గ్రేటర్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ విజయలక్ష్మి ని కోరినట్లు జిహెచ?ంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు డివిజన్ పరిధిలోని దేవకమ్మ తోట సమీపంలో గల 3000 గజాల ప్రభుత్వ భూమిలో రెండు వార్డు కార్యాలయాలు ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయం నిర్మాణం కోసం ఇటీవల జోనల్ కమిషనర్ పర్యటించిన విషయం తెలిసిందేనదే అన్నారు ఈ విషయంపై జిహెచ?ంసి మేయర్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన మేయర్ అట్టి నిర్మాణాలకు సుమారు 6 కోట్ల రూపాయలు ప్రతిపాదనలు పంపాలని కమిషనర్ను ఆదేశించినట్లు ఆమె తెలిపారు హస్తినాపురం డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నట్లు తెలిపారు ఈ సందర్భంగా మేయర్ కమిషనర్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు డివిజన్ లొ ప్రధాన సమస్యలన్నిటికీ నిధులు మంజూరు చేయించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు మిగిలి ఉన్న పనులకు నిధులు మంజూరు చేయాలని మేయర్ ను కోరినట్లు తెలిపారు వారి వెంట స్థానిక కాంగ్రెస్ నాయకుడు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు



## మైనంపల్లి గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తా

**- గ్రామసభలో పాల్గొన్న సర్పంచ్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొర్ర రామ్ సింగ్**

దేవరకొండ జనవరి 22 వార్త మిర్రర్ :దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద స్థానిక సర్పంచ్,మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు కొర్ర రామ్ సింగ్ నాయక్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు.ఈ గ్రామ సభకు వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు పాల్గొని పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాంసింగ్ నాయక్ మాట్లాడుతూ రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలందరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని అన్నారు. అదేవిధంగా గ్రామంలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా ఎమ్మెల్యే బాలునాయక్ సహకారంతో పరిష్కరిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ లాలు, వార్డు సభ్యులు సంతోష వెంకట్,లక్ష్మీ ప్రశాంత్, సునీత బద్దు,కిషన్,స్నేహ వినోద్, నాగరాజు, దాసు,పంచాయతీ కార్యదర్శి అంబెద్కర్,జిపివో శంకర్, ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ హుస్సేన్ నాయక్,వ్యవసాయ సహాయ అధికారి అభిలాష్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు భాగ్యలక్ష్మి,వివికే సేవ్య,అంగన్వాడీ టీచర్లు కమలమ్మ, దేవి,బుజ్జి, ఏఎన?ం విజయ,విద్యావతి, ఆశా కార్యకర్తలు అలివేలు,ధనమ్మ, ఝాన్సీ,విద్యుత్ లైన్ మెన్ శివ గ్రామస్థులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# 24 తేదీన నాడు అభివృద్ధి పనులకు భూమి పూజ చేయనున్న రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**రాయికల్ పట్టణ పద్మశాలి సేవా సంఘం లో ఏర్పాటు చేయనున్న మంత్రి సభను ప్రజలు నాయకులు విజయవంతం చేయాలి.**

**మహిళా సంఘాలకు 11 లక్షల వడ్డీ లేని రుణాలు పంపిణీ**

**రాయికల్ పట్టణ సమగ్ర అభివృద్ధి కి కృషి చేస్తా**

**ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్**



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 22

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణములో 7 కోట్ల 20 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమిపూజ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భూమిపూజ స్థలం, సభ ఏర్పాట్ల పరిశీలన చేసి, సభను విజయవంతం చేయాలని ప్రజలను మీడియా ద్వారా జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ కోరారు. పద్మశాలీ సేవా సంఘంలో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ గారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం లో రాయికల్ పట్టణం లో గతంలో పని చేసిన కాంట్రాక్టర్లకు 3 కోట్ల బిల్లులు చెల్లింపు చేయడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం లో 4 కోట్ల పనులు రాయికల్ పట్టణం లో చేయటం జరిగింది.. 82 లక్షలతో నూతన పనులకు అనుమతులు రావడం జరిగింది.15 కోట్ల రాయికల్ పట్టణ అభివృద్ధి కి నిధులు మంజూరు అయ్యాయి. 7.20 కోట్ల లో 1 కోటి తో మున్సిపల్ పార్కు అభివృద్ధి చేస్తున్నాం. 20 లక్షల తో డివైడర్ పనులు, 3.15 కోట్ల జజ రోడ్లు డ్రైనేజీ లు పనులు. పట్టణం లో జంక్షన్ ల అభివృద్ధి కి 1 కోటి కేటాయింపు చేయటం జరిగింది. 5 కోట్ల నిధులు స్టార్మ్ వాటర్ డ్రైనేజీ కి 4 చోట్ల పెద్ద డ్రైనేజీలకి కేటాయింపు చేయటం జరిగింది.15 కోట్ల తో రాయికల్ మున్సిపల్ సమగ్ర అభివృద్ధి చేస్తాం. స్మశాన వాటిక అభివృద్ధి కోసం 50 లక్షలు ,1 కోటి రూపాయలు రాయికల్ రామాజీ పెట్ వీధి దీపాలు కు కేటాయించడం జరిగింది. మహిళా సంఘాల కు 11 లక్షల వడ్డీ లేని రుణాలు మంత్రి గారి చేతుల మీదుగా పంపిణీ చేయటం జరుగుతుంది అని అన్నారు. నా పై కావాలనే తప్పుడు ఆరోపణలు...అగ్రిమెంట్ లేకుండా ఎలాంటి పనులు సాగవు...జగిత్యాల పట్టణంలో వినాయక నవరాత్రుల సందర్భంగా ప్రజల కోసం అభివృద్ధి పనులు చేపట్టిన....అన్ని తెలిసిన వాళ్ళే పదే పదే విమర్శలు చేస్తే అబద్ధాలు నిజం కావు..గెలిపించిన ప్రజల కోసం అభివృద్ధి చేసి చూపిస్తా....ఈ కార్యక్రమంలో నాయకులు మోర హనుమండ్లు గంద్ర రమాదేవి అచ్యుత రావు ఏనుగు మల్లారెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు .



## ఛలో బాలాపూర్ ధర్మ రక్షణ సభకు రెండు లక్షల రూపాయల చెక్కును అందజేసిన మాజీ మేయర్ దంపతులు

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 22 : మహేశ్వరం నియోజకవర్గంలోని జీహెచ్ ఎంసీ పరిధిలోని బాలాపూర్ లో ఈనెల 24వ తేదీన గణేష్ సేన ఆధ్వర్యంలో బాలాపూర్ లోని శివాజీ చౌక్ వద్ద బంగ్లాదేశ్ మరియు రోహింగ్యాలను అరెస్ట్ చేసి తిప్పి పంపడమే లక్ష్యంగా నిర్వహించనున్న జాగో భాగ్యనగర్ ఛలో బాలాపూర్ ధర్మ రక్షణ సభ కోసం రెండు లక్షల రూపాయల చెక్కును కమిటి వారికి అందజేసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కొలను శంకర్ రెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, నాయకులు టేకుల శశిధర్ రెడ్డి, నవారు శ్రీనివాస్ రెడ్డి, కోలన్ కృష్ణ రెడ్డి, కళ్ళెం లక్ష్మారెడ్డి, గౌరిగే శ్రీశైలం, నిరుడు శ్రీరాములు, ఇక్కే శ్రీను, రావుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ జెడ్పిహెచ?స్ హైస్కూల్లో పర్యావరణం పై అవగాహన

**విద్యార్థులకు అవగాహన కల్పించిన కవిరాజు "డాక్టర్ జయరాజ్"**







దేవరకొండ జనవరి 22 వార్త మిర్రర్ దేవరకొండ పట్టణంలో స్థానిక పీఎం శ్రీ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పర్యావరణం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర కవి రాజు పాటల రాజు "డాక్టర్ జయరాజు", మిలియన్ ఫార్మర్ ఆఫ్ ఇండియా-2024 అవార్డు గ్రహీత లోకసాని పద్మా రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా కవిరాజు డాక్టర్ జయరాజు మాట్లాడుతూ విద్యార్థి దశనుండే పరిసరాల పరిశుభ్రతను అలవాటు చెయ్యాలి అని పర్యావరణానికి పెను సవాలుగా మారిన ప్లాస్టిక్ వినియోగాన్ని వ్యక్తిగతంగా తగ్గించుకోవడంతో పాటు ప్లాస్టిక్ వలన జరిగే అనర్థాలను, సమాజానికి అర్థమయ్యే రీతిలో విద్యార్థులకు ఉపాధ్యాయులు తెలియజేయాలనీ తెలిపారు.చిన్న వయస్సు నుంచే పర్యావరణంపై అవగాహన కల్పిస్తేనే భవిష్యత్తులో స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన నగరాన్ని నిర్మించుకోగలమని తెలిపారు. ప్రతి విద్యార్థి పర్యావరణ రక్షణలో భాగస్వామి కావాలని, మొక్కలు నాటడం ప్లాస్టిక్ నియంత్రణ వంటి అంశాలపై దృష్టి సారించాలని కోరారు. పర్యావరణం బాగుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని ఆయన వివరించారు.భారతీయ చింతనలో, వాఙ్మయంలో ప్రకృతికి ఆరాధనాభరితమైన స్థానం ఇవ్వబడింది. "సర్వేజనా సుఖినోభవంతు" అనడమే కాకుండా సమస్త జీవులు కూడా సుఖంగా ఉండాలని అభిలషించారు. అదేవిధంగా ప్రకృతిలోని ప్రతి అణువుకు దైవత్వాన్ని, భూమికి శాంతి, నింగికి శాంతి, అంతరిక్షానికి శాంతి, అగ్నికి శాంతి, నీటికి శాంతి, దిక్కులకు శాంతి, ఓషధులకు శాంతి చివరకి శాంతికే శాంతి కావాలని ఆకాంక్షించారు.గాలి,నీరు, నేల,ఆహారం అవసరం. చెట్లు పక్షులు జంతువులను మనం జాగ్రత్తగా చూసుకుంటే మనకు కావలసినవి వాటినుండి దొరుకుతాయి అని అవి క్షేమంగా ఉంటేనే మనం కూడా క్షేమంగా ఉంటాం మని కాగా ప్రకృతిలోని ప్రతి ప్రాణికి ఒక్కొక్క ప్రత్యేకమైన స్థానం ఉంది ప్రపంచంలోని ప్రతి జీవికి శక్తి సూర్యుడి నుండి లభిస్తుంది అని తెలిపారు.భూమిపై నివసించే రకరకాల జీవులు ఒకదానిపై మరొకటి ఆధారపడి జీవిస్తున్నాయి. అన్ని జీవరాశులకు ప్రధాన ఆహారం మొక్కల నుండి అందుతోంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు పాఠశాల గెజిటెడ్ హెడ్మాస్టర్ చెరుపల్లి శ్రీనివాసులు పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## వాసవి క్లబ్, వాసవివనిత క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో ఇరుముడి: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవి మాల భక్తులు

దేవరకొండ జనవరి 22 వార్తా మిర్రర్ :నల్లగొండ పట్టణానికి చెందిన వాసవి మాల ధరించిన వాసవీమాతలు దేవరకొండ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయమునకు వాసవి మాల ఇరుముడి విప్పడానికి దేవరకొండకు చేస్తున్న సందర్భంగా వాసవి క్లబ్ ,వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. వారిని కోదండ రామాలయం నుండి భజన బజంత్రీలతో కోలాటాలతో వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయమునకు ఊరేగింపుగా తీసుకొని వచ్చి వాసవి మాత విరిముడి పూజలు నిర్వహించి వాసవి మాతకు అప్ప చెప్పడం జరిగినది . ఇట్టి కార్యక్రమంలో నల్గొండ నుండి విచ్చేసిన మహిళలకు ప్రతి ఒక్కరికి చీర సారే కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో వాసవివనిత క్లబ్ అధ్యక్షురాలు పందిరి జ్యోతి కార్యదర్శులు బెజవాడ మల్లేశ్వరి కోశాధికారి ఆలంపల్లి శిరీష మరియు వాసవి క్లబ్ అధ్యక్షులు ఆంజనేయులు కార్యదర్శి బెల్దే రవీందర్ కోశాధికారి పందిరి వెంకన్న మరియు జోన్ చైర్మన్ కొత్త సావిత్రి సుబ్బారావు డిస్ట్రిక్ట్ జోన్ ట్రెజరర్ ఆలంపల్లి పద్మ వాసవి వనిత క్లబ్ సభ్యులు కుంచకూరి సంధ్య కర్నాటి శాంత కుమారి మంచికంటి పద్మ కుంచకూరి శిరీష చీదెళ్ల శ్రీదేవి సముద్రాల రేణుక బండారు శోభ వీరమల్ల భాగ్యలక్ష్మి షీలా చంద్రకళ ఉప్పల శ్రీలత సాధు వనిత వాసవి క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ నూతన ముఫ్తి గా సయ్యద్ అంజద్ అలీ ఖాస్మి ఎంపిక





దేవరకొండ జనవరి 22 వార్త మిర్రర్ : దేవరకొండ నియోజకవర్గ ముస్లిం మత పెద్ద గా, నూతన ముఫ్తి గా ఖాతీబ్ - ఏ - ఈదెన్ గా,ముఫ్తి సయ్యద్ అంజద్ అలీ ఖాస్మి నీ దేవరకొండ ఈద్గా కమిటీ ఎంపిక చేసింది. ఈ నెల 18 న స్థానిక మక్కా మస్జీద్ లో జరిగిన ఈద్గా కమిటీ సమావేశంలో ప్రజల అభిష్టం మేరకు ముఫ్తి సయ్యద్ అంజద్ అలీ ఖాస్మి పేరును ఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీమోద్దీన్ ప్రతిపాదించారు. దింతో కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం పలికారు. ప్రజల అభిష్టం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని వారు తెలిపారు స్వర్గస్తులైన దేవరకొండ ముఫ్తి హాజ్రత్ మహ్మద్ జావీద్ హుస్సేన్ ఖాస్మి రహ్మతుల్లా అలైహి యొక్క పూర్తి బాధ్యతలు, సేవలు ఇక నుండి ముఫ్తి సయ్యద్ అంజద్ అలీ ఖాస్మి నిర్వహిస్తారని పేర్కొన్నారు. రంజాన్, బక్రీద్ వేళా ఈద్గా లో జరిగే ప్రత్యేక ప్రార్థనలకు నూతన ముఫ్తి సయ్యద్ అంజద్ అలీ ఖాస్మి సారథ్యం వహిస్తారన్నారనీ తెలిపారు. అనంతరం ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో ముఫ్తి సయ్యద్ అంజద్ అలీ ఖాస్మి నీ ఈద్గా కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు పూలమాలతో శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రహత్ అలీ, గౌరవ అధ్యక్షులు షబ్బీర్ అహ్మద్, జావీద్ అలీ, జనరల్ సెక్రటరీ యండి ఇలియాస్ పటేల్, ఉపాధ్యక్షులు జాఫర్ ఖాన్, యండి షబ్బీర్, సెక్రటరీ ఇలియాస్ బాబా, జాయింట్ సెక్రటరీలు ఖైసర్, అఫ్రోజ్, సహాయ కార్యదర్శులు ముజీబ్, సయ్యద్ అజీజ్, సభ్యులు ఖుద్రతుల్లాహ్, సయ్యద్ దస్తగిర్, యండి సలీమ్, హమీద్, షకీల్, ఖాజ, షఫి, మంజూర్, అడ్వైజరీ కమిటీ సభ్యులు ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



## శంకర్?పల్లిలో కరాటే విన్యాసాల జోరు ఆకట్టుకున్న ఎల్.బి.కె అకాడమీ విద్యార్థులు

వార్త మిర్రర్ జనవరి 22 శంకర్?పల్లి:

శంకర్?పల్లిలో నారాయణ స్కూల్ సమీపంలో ఉన్న చిల్డ్రన్ పార్క్ లో ఎల్.బి.కె (ౌదీఖ) కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల కరాటే ప్రదర్శనలు చూపర్లను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అకాడమీ ప్రతినిధి రవీందర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ఆత్మరక్షణ నైపుణ్యాలను ప్రదర్శించి అందరినీ అబ్బురపరిచారు.

### ఆత్మరక్షణే ఆయుధం - అతిథుల ప్రసంగం

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి విద్యార్థి, ముఖ్యంగా బాలికలు ఆత్మరక్షణ విద్యలను నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఆయన రోడ్డు భద్రత (=శ్రుం ౫ఖటవ్ం) పై అవగాహన కల్పిస్తూ, వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు పాటించాలని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించారు.

### ధర్మ ప్రచారం సామాజిక స్పృహ

అధ్యాత్మిక ధర్మ ప్రచారంలో భాగంగా గాయత్రి ప్రసంగిస్తూ విద్యార్థులకు చిన్నతనం నుండే ధర్మం పట్ల, నైతిక విలువల పట్ల అవగాహన ఉండాలని కోరారు. సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమం చివరలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థుల విన్యాసాలతో కాలనీ ప్రాంతం సందడిగా మారింది. ఈ వేడుకలో మాజీ సొసైటీ చైర్మన్ శశిధర్ రెడ్డి, చైతన్య కాలేజ్ కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి, ఎస?లు శ్రీశైలం, బేతప్ప, అకాడమీ నిర్వాహకులు, వివిధ కాలనీల వాసులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పెద్ద తండాలో అంగన్వాడి ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీ




దేవరకొండ జనవరి 22 వార్త మిర్రర్ దేవరకొండ మండల పరిధిలోనీ శేరిపల్లి పెద్దతండా అంగన్వాడి కేంద్రం నందు గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి సూపర్వైజర్ చిట్టెమ్మ, గ్రామ సర్పంచ్ బావ్ సింగ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ బాల్యవివాహాలు, బాలల అక్రమ దత్తత, మాదకద్రవ్యాల వినియోగం ,బాలలపై లైంగిక వేధింపులు వంటి బాలల సమస్యలను అధిగమించుటకై గ్రామ స్థాయిలలో బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశామని ఎక్కడైనా బాల్యవివాహాలు, అక్రమ దత్తత వంటి సమస్యలు వచ్చినప్పుడు అందరం కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని తెలియపరిచారు.కుటుంబ పరిస్థితుల కారణంగా చదువు మానివేసే అవకాశం ఉన్న బాలికలకు బాల్యవివాహాలు జరిగే ఆస్కారం ఉన్న కుటుంబాలపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలని లింగ వివక్షత లేకుండా పిల్లలను ఉన్నతమైన చదువులు చదివించాలని బాలల హక్కులకు సంబంధించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలిఅని ప్రతి గ్రామ సభలో పిల్లల గురించి చర్చించేలా చూడాలి అని తెలియజేశారు, ఆరేండ్లకు పైబడిన బాలలందరూ బడికి వెళ్లేలా చూడాలని, బడి మానివేసిన పిల్లలను గుర్తించి వారిని తిరిగి బడిలో చేర్పించాలని, బాలలపై లైంగిక వేధింపులు మరియు బాలల హక్కుల ఉల్లంఘటనలు జరిగిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 మరియు పోలీస్ హెల్ప్ లైన్ 100కు ఫోన్ చేయాల్సిందిగా తెలియపరిచారు... అక్రమ రవాణా, బాల్యవివాహాలు శిశు విక్రయాలు జరిగితే శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు, ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ శ్రీదేవి, స్కూల్ టీచర్ సామ్రాజ్యం, ఏఎన?ం సావిత్రి అంగన్వాడి టీచర్లు శాంతాబాయి, పద్మ, సునీత, ఆశా వర్కర్ గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్లు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొనడం జరిగింది..

# వాసన్ ఐ కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నగరంలో సేవా కార్యక్రమాలు

**డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలతో రోడ్డు భద్రతకు దోహదం**






సికింద్రాబాద్, జనవరి 22 (వార్త మిర్రర్):భారతదేశంలో ప్రముఖ కంటి సంరక్షణ సంస్థగా గుర్తింపు పొందిన వాసన్ ఐ కేర్ హాస్పిటల్స్, మెరుగైన దృష్టి సంరక్షణ ద్వారా సురక్షితమైన డ్రైవింగ్?ను ప్రోత్సహించే లక్ష్యంతో నగరంలో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాల్లో భాగంగా "డ్రైవర్ దృష్టి -- మెరుగైన దృష్టి ద్వారా రోడ్డు భద్రత" అనే రహదారి భద్రతా అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ ప్రచారం జనవరి 11 నుంచి ఫిబ్రవరి 11, 2026 వరకు కొనసాగనుంది. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా రహదారి భద్రతను ప్రభావితం చేసే వివిధ దృష్టి లోపాలను ముందస్తుగా గుర్తించడం, డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా ఉంది. ముఖ్యంగా వాణిజ్య వాహన డ్రైవర్లకు ప్రాధాన్యం ఇస్తూ, వక్రీభవన లోపాలు, కంటిశుక్లం (కాటరాక్ట్) సహా ఇతర దృష్టి సంబంధిత సమస్యలపై ఉచిత కంటి స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహిస్తున్నారు.పరీక్షల్లో తదుపరి చికిత్స అవసరమయ్యే డ్రైవర్లను సమీపంలోని వాసన్ ఐ కేర్ హాస్పిటల్స్ కేంద్రాలకు రిఫర్ చేస్తున్నారు. అలాగే అర్హత కలిగిన లబ్ధిదారులకు పరిమిత స్లాట్లలో ఉచిత కంటిశుక్లం శస్త్రచికిత్సలు, ప్రీ-ఆపరేటివ్ పరీక్షలు, అవసరమైన మందులను కూడా అందిస్తున్నారు.ఈ కార్యక్రమాన్ని వాసన్ ఐ కేర్ వైద్యులు డాక్టర్ నళిని కాంత ఎం, డాక్టర్ ఉదిత్ అజ్మాని, డాక్టర్ నయన టి, డాక్టర్ మనోజ్ కుమార్ పి లు, మలక్?పేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిఐ కె. రామకృష్ణ, ఎస్?ఐ వినోద్ కుమార్ సమక్షంలో ప్రారంభించారు.ఈ సేవా కార్యక్రమం ద్వారా అవగాహనతో పాటు అందుబాటులో ఉన్న నాణ్యమైన కంటి సంరక్షణ సేవలను అందిస్తూ, రోడ్డు భద్రతను పెంపొందించడం, సమాజ కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడం తమ ప్రధాన లక్ష్యమని వాసన్ ఐ కేర్ హాస్పిటల్స్ మరోసారి స్పష్టం చేసింది.

